

బెల్టు ఫుల్

- జిల్లాలో విచ్చలవిడిగా బెల్టు షాపులు
- ప్రోత్సహిస్తున్న వైన్సు నిర్వాహకులు
- మద్యం అధిక రేట్లకు విక్రయిస్తున్నా పట్టింపు కరువు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఎక్సైజ్ అధికారులు



కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న చింతగూడ మహిళలు(ఫైల్)

కాగజ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఊరురా మద్యం ఏరులై పారుతోంది, లక్ష్యాల మాటున ప్రధాన దుకాణాల నిర్వాహకులు గ్రామాలను పంచుకుంటూ దర్జాగా ఊరుకో మద్యం దుకాణం తరహాలో బెల్టు షాపుల అక్రమ దందాను మూడు, పువ్వులు ఆరు కాయలు అన్నట్టుగా నిర్వహిస్తు రెండు చేతులా ఆర్జిస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 15 మండలాల పరిధిలో 38 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఒక్కో మద్యం దుకాణం పరిధిలో గ్రామానికి రెండు చొప్పున సుమారు వెయ్యికి పైగానే బెల్టుషాపులు కొనసాగుతున్నాయంటే పరిస్థితి ఏ స్థాయి లో ఉందో తెలియజేస్తోంది. బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలను అరికట్టాల్సిన ఎక్సైజ్ యంత్రాంగం చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదని చెబుతున్నారు. ఫలితంగా ఎక్కడ చూసినా బెల్టు షాపుల దందానే కనిపిస్తోంది. దానికి తోడు బెల్టు షాపులోనే గుడుండా, దేశీదారు వంటి అక్రమ మద్యం కూడా లెక్కకు మిక్కిలి విక్రయాలు సాగుతున్నాయి.

● మహారాష్ట్ర సమీపంలో ఉన్న గ్రామాల్లో..

ముఖ్యంగా కాగజ్‌నగర్ డివిజన్‌లోని మహారాష్ట్ర సమీపంలో ఉన్న కౌటాల, చింతలమానేపల్లి, బెజ్జూరు మండలాల్లో మద్యం బెల్టు షాపుల దందా జోరుగా సాగుతోంది. నగటున ప్రతీ బెల్టు షాపు ద్వారా రూ. ఐదు నుంచి రూ.10లక్షల మేర అమ్మకాలు జరుగుతున్నట్టు చెబుతున్నారు. ఇక డివిజన్ కేంద్రమైన కాగజ్‌నగర్‌లోనైనా పరిస్థితి మరి దారుణంగా తయారైంది. కాగజ్‌నగర్ రూరల్, టౌన్ పోలీస్‌స్టేషన్ల, ఎక్సైజ్ ప్రధాన కార్యాలయానికి కూత వేటు దూరంలోనే బెల్టు షాపులు నడిపిస్తున్నారు. జంకు, బొంకు లేకుండా యథేచ్ఛగా విక్రయాలు సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. కాగజ్‌నగర్‌లోని 30 వార్డులకు గాను ఒక్కో వార్డులో ఐదు బెల్టు షాపులు కొనసాగుతున్నట్టు ఇటీవల ఓ స్వచ్ఛంద సంస్థ జరిపిన అధ్యాయనంలో తేలింది. కొంత కాలంగా బెల్టు దుకాణాల పెరుగుదల గణనీయంగా ఉందని చెబుతున్నారు. గ్రామాల్లో ఇళ్ల మధ్యే ఈ బెల్టు దుకాణాలు నిర్వహిస్తుండడం మందు బాబులు చేస్తున్న రచ్చా అంతా ఇంతా కాదు. ఇటీవల కాగజ్ నగర్ మండలం చింతగూడలో మందు బాబుల వీరంగాన్ని భరించలేక మహిళలు రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిరసన చేపట్టారు. దాంతో మొక్కుబడిగా గ్రామంలో బెల్టు దుకాణాలను మూయించేందుకు హడావుడి చేసిన రెండు రోజుల తర్వాత మళ్లీ కొనసాగిస్తున్నారు. దీనిపై గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలే ఏకమై గ్రామంలోని బెల్టు షాపులన్నింటిపై దాడులు నిర్వహించారు. ఈ సంఘటనలో జిల్లా అధికారులు స్పందించి విచారణ చేపట్టాల్సి వచ్చింది.

● అర్ధరాత్రి వరకు విక్రయాలు..

మద్యం ప్రధాన దుకాణాలు రాత్రి పది గంటల వరకే అనుమతి ఉంటుంది. అర్ధరాత్రి వరకు ఈ బెల్టు షాపులు అందుబాటులోకి ఉంటున్నాయి. ఏ సమయానికైనా కూడా మందు లభిస్తుండడంతో అంతా కూడా బెల్టు షాపుల వద్దకే వచ్చి సేవిస్తున్నారు. నెల వారీగా మద్యం టార్గెట్ అమ్మకాలు చేపట్టాలని ప్రభుత్వం లక్ష్యాలు విధిస్తోంది. దీంతో ప్రధాన మద్యం దుకాణాల్లో ఆశించిన మేర సెల్స్ పెరుగక పోవడంతో ప్రత్యామ్నాయంగా బెల్టు షాపులకు మందు తరలించి విక్రయిస్తున్నారు. తమకు అమ్మకాలు ముఖ్యమన్నట్లుగా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల కౌటాల మండలం గురుడుపేటలో బెల్టు దుకాణాలను మూసివేయాలని మహిళలు రోడ్డుపైకి నిరసలు చేపట్టి పోలీస్‌స్టేషన్‌లో సైతం ఫిర్యాదులు చేశారు. కానీ ఇంత వరకు ఎలాంటి చర్యలు లేక పోవడంతో అడ్డుకట్ట పడడం లేదు. మద్యానికి బానిసై కౌటాల మండలం గుడురుపేటకు చెందిన తలండి రవి(28) పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడటంతో భార్య భారతి, ముగ్గురు పిల్లలు దిక్కు లేని పరిస్థితి నెలకొంది. అలాగే కౌటాల మండలం మొగడ్‌గగడ్ గ్రామానికి చెందిన గత నెల 11న వ్యవసాయ బావి లో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. బెజ్జూరు మండలం బారెగూడకు చెందిన చౌదరి ఇస్తారి(74) ఈ నెల 3న మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నారు. ఆసిఫాబాద్ మండలం బూరుదగూడకు చెందిన రవీందర్(38) మద్యానికి బానిసై కుటుంబీకులతో గొడవ పడుతుండేవాడు. ఈ నేపథ్యంలో మే 19న ఇంట్లో గొడవ పడి ఆత్మహత్య చేసుకున్నారు. జిల్లాలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా కూడా ఇంత వరకు బెల్టు షాపులపై ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం స్పందించి బెల్టు షాపులను మూసివేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులు నియంత్రించాలి..

- భీంరావు పటేల్, చింతగూడ



బెల్టుషాపులను అధికారులు నియంత్రించాలి. రేయింబవళ్లు విక్రయాలు సాగుతున్నా నియంత్రిం చాల్సిన అధికారులు అటు వైపు కన్నెత్తి చూడడం లే దు. అర్ధరాత్రి వరకు మద్యం లభిస్తుండడంతో తాగిన వ్యక్తులు కుటుంబ సభ్యులతో గొడవలు పడుతు న్నారు. ఇటీవల కొందరు మద్యం మత్తులో ఆత్మహత్యలకు సైతం పాల్పడ్డారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు..

-షెండే ధర్మాబాయి, చింతగూడ



బెల్టుషాపులపై అధికారులకు ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో మహిళలతో కలిసి ఆందోళన చేపట్టాం. ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేశాం. ఉన్నతాధికారులు స్పందించి బెల్టుషా పులు కొనసాగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి.

అర్హులైన దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లు


సదరం శిబిరాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): అర్హులైన దివ్యాంగులకు మాత్రమే సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని జిల్లాఅదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సదరం శిబిరాన్ని సందర్శించి క్యాంపు నిర్వహణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాటాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న సదరం శిబిరం ద్వారా అర్హులైన దివ్యాంగులకు ధ్రువపత్రాలు మంజూరు చేయాలని చెప్పారు. పారదర్శకంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. శిబిరానికి హాజరైన దివ్యాంగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, వైద్యాధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సిర్పూర్(యు), జూలై 4 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. మండల కేంద్రంలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లలను శుక్రవారం సీఐటీయూ నాయకులతో కలిసి విడుదల కార్మిక సంఘలతోపాటు ప్రజలు సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆత్రం గంగారాం,భవన నిర్మాణ అధ్యక్షుడు గేడం నాగోరావు,మెస్రం సుభాష్,మానిక్‌రావు,హైమాద్, మాధవ్‌రావు,మాల్కు,బాదిరావు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యం సేవలు అభినందనీయం


ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమంతో పాటు సమాజపరంగా ఎస్పీఎం యాజమాన్యం సేవలు అభినందనీయమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే కొనియాడారు. ఎస్పీఎం సౌజన్యంతో 20 మంది నిరుపేద దివ్యాంగులకు శుక్రవారం ట్రైసైకిళ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో వికలాంగులను చిన్న చూపు చూడకుండా తమ వంతుగా సహాయం చేయాలన్నారు. ఎస్పీఎం యాజమాన్యం వికలాంగులకు ట్రైకిళ్లను అందజేయటం శుభపరిణామన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఎసీఎం యూనిట్ హెడ్ ఏకే మిశ్రా, జనరల్ మేనేజర్ ఎం ఎస్ గిరి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు

లింగాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేసే పీఎం జుగ పథకం ద్వారా గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నదని ఎంపీడీవో రాంచందర్, ఎస్సీఆర్పీ కనక బుచ్చిరాం అన్నారు. మండలంలోని కంచన్‌పెల్లి, ఘుమ్నూర్(బి గ్రామ పంచాయతీలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పీఎం జుగా, పీఎం జనమన్ కార్యక్రమాలపై కళాజతా బృందంచే అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీప్యూటీ తహసీల్దార్ పెద్దరాయుడు, అర్ఐ ప్రదీప్, ఎపీఎం తిరుపతి, ఎపీవో చంద్రయ్య, ఎవో సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

వాంకిడి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా, సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు మండలంలో ప్రారంభమయ్యాయి. బంబార, కనర్‌గాం, వాంకిడి, గ్రామాల్లో పీరీల బంగ్లాలను ఏర్పాటు చేశారు. బంగ్లాలలో ప్రతిష్ఠించిన పీరీలకు ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీజీలను భాజాభజంత్రీలతో ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం పుంజుమేర గూడలో శుక్రవారం మొహర్రం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. భువమాతల్లి దేవస్థానం వద్ద చిన్నసరిగెత్తు చేపట్టారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో నికోడే శ్రీకర్, వినోద్ జైశ్వాల్, కాంతరావు, గుర్లె బాలాజీ, వడాయి శివరాం, నికోడే శ్రీకాంత్, నిమ్మాజీ శ్రీకాంత్, నిజ్మాజీ భగవాన్, రాకేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

దివంగత ముఖ్యమంత్రి రోశయ్యకు ఘన నివాళి

ఆసిఫాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల దివంగత ముఖ్య మంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన చిత్రపటాలకు అధికారులు, నాయకులు పూల మాలలు వేసి నివాళులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో శుక్రవారం వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, యాదవ, వైశ్య సంఘాల నాయకులు, అధికారులతో కలిసి దొడ్డి కొమురయ్య, రోశయ్యల చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్, గిరిజన సంక్షేమాధికారిణి రమాదేవి, జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, కలెక్టరేట్ ఏఓ కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకన్న, యాదవ, వైశ్య సంఘం నాయకులు, అధికారులు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో రోశయ్య జయంతిని పురస్కరించుకుని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాటా్లడుతూ రోశయ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో సుదీర్ఘకాలం పాటు సేవలందించారని అన్నారు. ఆర్థిక మంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాణా ప్రతాప్, ఆర్‌ఐ పెద్దన్న, డీపీవో ఏవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ డివిజన్ కార్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ శ్రావణి, విజిలెన్స్ ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మారెడ్డి, మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగుసురేష్ కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

రెబ్బెన, (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో జీఎం విజయభాస్కర్ రెడ్డి రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఓ టూ జీఎం కె.రాజమల్లు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వ్ కుమార్ బెహెర, ఏరియా సెక్యూరిటి అధికారి ఎన్.ఉమాకాంత్ పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

వాంకిడి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న 34వ వర్షవాస్‌ని పురస్కరించుకుని బుద్ధుడితో నా ప్రయాణం నాటిక పోస్టర్లను శుక్రవారం భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు అశోక్, దుర్గాజీ తదితరులు పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం షీ టీం సేవలపై ఇన్‌చార్జి సునీత అవగాహన కల్పించారు. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, షీ టీం సిబ్బంది రమాదేవి, శ్రీనివాస్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

కెరమెరి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను శుక్రవారం ఎస్సై మధుకర్ బాధితులకు అందజేశారు. కెరమెరికి చెందిన ఇద్దరు వ్యక్తులు సయ్యద్ అమీరో ద్దీన్, కదమ్ సద్దుల, జోడేఘాట్‌కు చెందిన జంగు అనే వ్యక్తులు సెల్‌ఫోన్‌లో పోవడంతో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

● సంక్షిప్తం..

చెత్తాచెదారం తొలగించాలి

వాంకిడి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజ నల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని డీఎల్‌పీవో ఉమర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారంపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు.

బిల్లులు విడుదల చేయాలి

ఆసిఫాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు సంబంధించిన మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు విడుదల చేయాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు డీఎంహెచ్‌వో కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ప్రకాష్, సంతోష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఐద్వా కేంద్ర కమిటీ సభ్యులు కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వినోద తదితరులు పాల్గొన్నారు.

ప్రజాఫ్రంట్ పేరుతో వెలిసిన పోస్టర్లు

ఆసిఫాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లోకి ప్రవేశించే ద్వారం వద్ద శుక్రవారం మావోయిస్టుల ఆత్మరక్షణ ప్రజా ఫ్రంట్ తెలగాణ పేరుతో పోస్టర్లు అతికించారు. జనజీవన స్రవంతిలో కలిసి అభివృద్ధిలో భాగస్వా ములు కావాలని ఉండడం చర్చనీయాంశగా మారింది.

వనమహోత్సవంలో పాల్గొనాలి

పెంచికలపేట, జూలై 4(ఆంధ్రజ్యోతి): వనమహోత్సవంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ప్రత్యేకాధికారి ఇరిగేషన్ ఈఈ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం చెడ్వాయి, బొంబాయిగూడ, ఎల్కపల్లి గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటారు.

భోజనంలో మెనూ పాటించాలి

సిర్పూర్(టి), జూలై 4 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో మెనూ ప్రకారం వడ్డించాలని ఎంఈవో వేణుగోపాల్‌రావు అన్నారు. మండల కేంద్రంలో ని పాఠశాలలను శుక్రవారం ఎంఈవో తనిఖీ చేశారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి

కాగజ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): భట్టుపల్లి మూలమలుపు ప్రధాన రోడ్డు సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భట్టుపల్లి ప్రధాన రోడ్డు పూర్తిగా బురదమయంగా మారిందని చెప్పారు. అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా కూడా పట్టించుకోవడం లేదన్నారు. విషయం తెలుసుకొని తహసీల్దార్ మధుకర్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ధర్నా విరమించారు.


రోడ్డు వేయాలని ధర్నా చేస్తున్న విద్యార్థులు

రోడ్డు నిర్మించాలని గ్రామస్థుల బైఠాయింపు


రోడ్డుపై బైఠాయించిన సోమిని గ్రామస్థులు

బెజ్జూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సోమిని గ్రామంలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నైతం రాజు మాట్లాడుతూ కుశ్నపల్లి నుంచి సోమిని వరకు రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలలో వన మహోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఆవరణలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి కళాశాల విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనమహోత్సవంలో అందరు భాగస్వాములై మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సతీష్, సూపరింటెండెంట్ పాషా, శ్యాంబాబు, సుమంత్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ లలిత, ఏపీవో బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్, విద్యార్థులు

కేజ్ వీల్స్ చోరీ కేసులో ఇద్దరి అరెస్టు



మాట్లాడుతున్న ఎస్సై తాహసీనోద్దీన్

దండేపల్లి జూలై 4 (ఆంధ్రజ్యోతి): ట్రాకర్లు కేజ్ వీల్స్ దొంగతనం చేసిన కేసులో ఇద్దరు నిందితులను శుక్రవారం అరెస్టు చేసినట్లు దండేపల్లి ఎస్సై తాహసీనోద్దీన్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దండేపల్లి మండలం కొత్త మామిడిపల్లి గ్రామానికి చెందిన బత్తుల నరేష్‌కు చెందిన ట్రాక్టర్ కేజ్ వీల్స్‌ను మండలంలోని మదాపూర్ చెందిన పిట్టల సాయిరాం, బాలసాని సత్తయ్య అనే ఇద్దరు దొంగలు రాత్రి సమయంలో దొంగించి వారి బొలెరో వాహనంలో తరలించుకుని వెళ్లారు. బాధితుడు ఫిర్యా దు చేయగా సీసీ టీవీల ఆధారంగా వారిని గుర్తించి పోలీసు లు చాకచక్యంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఇద్దరు దొంగతనం చేసినట్లు ఒప్పుకోగా వారి నుంచి కేజ్ వీల్స్, తరలించిన బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై తెలిపారు..

హత్య కేసులో నిందితుడు..

కన్నెపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో భార్యను గొడ్డలితో నరికి హత్య చేసిన మెట్‌పల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల తిరుపతిని శుక్రవారం అరెస్టు చేసినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. శుక్రవారం కన్నెపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తిరుపతి తన భార్య తులసిని గురువారం ఉదయం గొడ్డలితో నరికి చంపాడు. మృతురాలు తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి బెల్లంపల్లి కోర్టులో హాజరు పరిచామన్నారు. సమావేశంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారం పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

భీమిని, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడె వ్యసనాలకు బానిసలు కావద్దని ఎస్సై విజ య్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని బిట్టూరుపల్లి యూపిస్ పాఠశాలలో గంజాయి మత్తు పదార్థాల నియంత్రణపై అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు చెన్నకేశవులు, గ్రామకార్యదర్శి జాహీద్, కానిస్టేబుల్ మహేశ్వరి, బీజేపీ మండల అధ్యక్షుడు కొంక సత్యనారాయణ, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వుమెన్‌సెల్ ఇన్‌చార్జిగా మౌనిక

మందమర్రి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా హెచ్‌ఎంఎస్ వుమెన్‌సెల్ ఇన్‌చార్జిగా స్థానిక ఏరియాలోని కేకే ఓసీలో పని చేస్తున్న పిట్ కార్యదర్శి మౌ నిక నియమితులయ్యారు. ఆమెను నియ మిస్తూ ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు వేదికలో చోరీ

బెల్లంపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల గురిజాల రైతు వేదికలో గురువారం రాత్రి దొంగలు దొంగతనానికి పాల్పడ్డారు. వ్యవసాయశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మాలగురి జాల రైతు వేదికలో గుర్తు తెలియని వ్యక్తులు రైతు వేదిక తలుపులు పగులకొట్టి వీడియో కాన్ఫరెన్స్ యూనిట్, రెండు సౌండ్ బాక్సులు ఎ త్తుకెళ్లారన్నారు. వీటి విలువ దాదాపు 3లక్షల రూపాయల వరకు ఉంటుందని తెలిపారు. వ్యవసాయాధికారుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంధుల పాఠశాలకు విరాళం

శ్రీరాంపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో రక్షణాధికారిగా పనిచేస్తున్న శ్రీధర్ రావు-లావణ్య దంపతుల కూతురు రాగశ్రీయ పుట్టినరోజు, బ్యాంకులో ఉద్యోగం పొందిన సందర్భాలను పురస్కరించుకొని శ్రీరాంపూర్‌లోని సాయి దృష్టి అంధుల పాఠశాల, వయోవృద్ధుల ఆశ్రమానికి లక్ష రూపాయల విరాళం అందించారు. ట్రస్ట్ కార్యదర్శి, డాక్టర్ కృష్ణకు శుక్రవారం చెక్కు అందజేశారు.

విద్యార్థుల వివరాలు అందజేయాలి

- సంఖ్య ఆధారంగా సరుకుల కేటాయింపు
- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల, ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలలు, కళాశాలలు, మహాత్మాజ్యోతిబాపూలే పాఠశాలలు, మైనార్టీ విద్యాలయాలో చదివే విద్యార్థులకు నాణ్యమైన కోడి గుడ్లు అందించేందుకు వివరాలు అందజేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి జిల్లా స్థాయి గుడ్ల సేకరణ కొనుగోలు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన కోడి గుడ్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం మినహాయించిన అన్ని విద్యాయలయాలకు గుడ్లను సరఫరా చేయడం కోసం అవసరమైన ఈ-టెండర్ నిర్వహణ కోసం విద్యార్థుల సంఖ్యను బట్టి అవసరం ఉంటుందో వివరాలు వెంటనే అందించాలన్నారు. అధికారులు దీనిపై దృష్టి సారించి అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి భాస్కర్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి నదీమ్ అహ్మద్, గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి సురేష్, జిల్లా మార్కెటింగ్ అధికారి అశ్వాక్ హుస్సేన్, ఎస్సీ అభివృద్ధి అధికారి సజీవన్ సంక్షేమాధి కారులు, ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించాలి

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు ప్రత్యే క దృష్టి సారించాలని వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని వీసీ హాల్ నుంచి శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖా స్తుల పరిశీలన, మూడు నెలల సన్నబియ్యం పంపిణీ, వన మహోత్స వం మొక్కలు నాటుట, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణ, గురకులాల పర్యవేక్షణ, పంచాయతీలలో పారిశుధ్యం, వానాకాలంలో యూరియా, డీఏపీలను అవసరమైన మేరకు సమకూర్చ డం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చేపట్టిన భూ భారతి రెవన్యూ సదస్సులలో జిల్లాలో 4,200 దరఖాస్తులు వచ్చాయని, ప్రతి దరఖా స్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తిరస్కరించినట్లయితే తిరస్కరణకు సంబంధించిన కారణాలను దరఖాస్తుదారు డికి వివరించాలన్నారు. న్యాయ పరంగా పరిష్కరించే దరఖాస్తులను ఈ నెల 15 వరకు పూర్తి చేయాలని, ప్రతి దరఖాస్తుదారుడికి నోటీసులు అందించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. సన్న బియ్యం పంపిణీలో మూడు నెలల కోటా సీఎంఆర్ బియ్యం సంబందిత రైస్ మల్లుల యజమానులతో సమీక్షించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో జిల్లాలో 51 లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, డీపీవో భిక్షపతి, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, వ్యవసాయ శాఖ ఏడీ మిలింద్, హౌజింగ్ పీడీ వేణుగోపాల్, తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, పాల్గొన్న అదనపు కల్టెర్ దీపక్‌తివారీ

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

కాగజ్‌నగర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. కాగజ్‌గర్ సర్‌సిల్క్ బ్రాంచ్ పాఠశాలలో శుక్రవారం ఇన్‌స్పైర్ మనాక్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇన్‌స్పైర్ ప్రదర్శన కోసం జిల్లా స్థాయిలో 6 నుంచి 12వ తరగతి విద్యార్థుల నుంచి ఐడియా కాంపిటేషన్ నిర్వహించనున్నామని చెప్పారు. ప్రతీ పాఠశాల నుంచి ఐదుగురు ప్రతిభావంతులను ఎంపిక చేయాలని సూచించారు. సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ అధికారులు విద్యార్థులకు ఇన్‌స్పైర్ కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మధుకర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, రిసోర్స్ పర్సన్లు మామిడాల తిరుపతయ్య, దుర్గా ప్రసాద్, ఎఫ్ఎఓ దేవాజీ, మండల విద్యాశాఖ అధికారి వాసాల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

వేమనపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగెనపల్లి గ్రామంలో గురువారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలపై తరలిస్తున్న వంద లీటర్ల గుడుంబాను పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం దహెగాం మండల నుంచి రెండు బైక్‌లపై గుడుంబా తరలిస్తున్నారనే సమాచారం రావడంతో మంగెనపల్లి వద్ద మాటు వేసి రెండు బైక్‌లను పట్టుకుని తనిఖీ చేశామన్నారు. నిందితులు బానోత్ ఆనంద్, ధరావత్ రాజులను పట్టుకుని వారి వద్ద నుంచి వంద లీటర్ల గుడుంబాను పట్టుకుని స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

భీమిని, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాంటెంకి శేఖర్ అనే వ్యక్తి పోగొట్టుకున్న తన మొబైల్ ఫోన్‌ను పోలీసులు శుక్రవారం అందించారు. శేఖర్ తన ఫోన్‌ను కొద్ది రోజుల కింద పోగొట్టుకున్నాడు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టి తన ఆధార్‌కార్డు, ఐఎంఈఐ నంబర్ల ఆధారంగా సీఈఐఆర్ మొబైల్ ఫోన్ ను పట్టుకున్నారు. బాధితుడికి ఎస్సై విజయ్ కుమార్ శుక్రవారం అందజేశారు.

ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

చింతలమానేపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ రైతు వేదికలో శుక్రవారం నిర్వహించిన బూత్ లెవల్ ఆఫీర్ జాతీయ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో మృతులను తొలగించి కొత్త ఓటర్లను చేర్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దౌలత్, సీనియర్ అసిస్టెంట్ జాఫర్, ఆర్ఐ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు తమ గ్రామ పంచాయతీల పరిధిలో నూతన ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్డీవో లోకేశ్వర్‌రావ్ అన్నారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో శుక్రవారం బీఎల్‌వోలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో ప్రయాణికుల ప్రయోజనార్థం నిర్మించిన సామూహిక మరుగు దొడ్డి గదులను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోహన్, ఏపీవో నగేష్, ఈవో కోరేంగ ఆనంద్‌రావ్, బీఎల్‌వోలు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

సిర్పూర్(టి), జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో ఒక్క మొక్కైనా నాటి సంరక్షించాలని జిల్లా సహకార కో ఆపరేటీవ్ అధికారి రాథోడ్ బిక్కు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

హాజీపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొనబండ గ్రామ శివారులో నిన్న రాత్రి డీసీఎం ను వెనుక నుంచి ఆటో ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్ చుంచు వంశీక్రిష్ణ(24) చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. హాజీపూర్ ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం లక్సె ట్టిపేట మండలం కొత్తకొమ్ముగూడెం గ్రామానికి చెందిన చుంచు వంశీక్రిష్ణ అదే గ్రామానికి చెందిన దుమ్మని సందీప్, కారుకూరి అంజీలను తన ఆటోలో ఎక్కించుకొని వెళ్తుండగా దొనబండ శివారులో జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న వాహనాల లైట్లకు ముందున్న వాహనం కనబడక డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ వంశీక్రిష్ణతో పాటు వెనుక ఉన్న మరో ఇదరికి గాయాలయ్యాయి. సమాచారం మేరకు హాజీపూర్ పోలీసులు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వంశీక్రిష్ణ మృతి చెందాడు. మృతుడి తల్లి చుంచు స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

లింగాపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన మండలంలోని జాముల్‌ధరా గ్రామానికి చెందిన సలాం సరస్వతి(33) అనే మహిళ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. లింగాపూర్ ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం.. జాముల్‌ధరా గ్రామానికి చెందిన సరస్వతి కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. చికిత్స తీసుకున్న నయం కాకపోవడంతో మనస్తాపం చెంది గురువారం రాత్రి ఇంటో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు జైనూర్ ప్రభాత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. వైద్యం పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందిందని ఎస్సై తెలిపారు.

ఏసీబీ వలలో డిప్యూటీ తహసీల్దార్

- రైతు నుంచి రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



పట్టుబడిన డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్, తాత్కాలిక ఉద్యోగి అంజి

కోటపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కోటపల్లి రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నరేష్ అనే రైతు నుంచి డిప్యూటీ తహసీల్దార్ నవీన్‌కుమార్ రూ. 10 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ ఆదిలాబాద్ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం భీమారం గ్రామానికి చెందిన నరేష్ తన తండ్రి గంట లక్ష్మణ్ పేరుతో కోటపల్లి మండలంలోని రాజారం గ్రామంలో సర్వే నెంబరు 71/13/2లో 20 గుంటల భూమి ఉంది. ఈ భూమిపై పట్టా పాస్ బుక్ పొందాలంటే ఆధార్ లింక్, ఈ కేవైసీ చేయాలి. ఇందుకోసం డిప్యూటీ తహసీల్దార్‌ను కలువగా రూ. 15 వేల లంచం డిమాండ్ చేశాడు. అన్ని డబ్బులు తన వద్ద లేవని చెప్పిన నరేష్ రెండు రోజుల అనంతరం వెళ్లి రూ. 10 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈలోగా బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించగా వారి సూచనలతో శుక్రవారం డబ్బులు తీసుకువచ్చి డిప్యూటీ తహసీల్దార్‌కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. కార్యాలయంలో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న అటెంటర్ కుమారుడు అంజికి ఇవ్వాలని సూచించాడు. బాధిత రైతు అంజిని కలిసి డబ్బులు ముట్టజెప్పాడు. ఆ డబ్బులను అంజి తీసుకువెళ్లి డీటీకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం తీసుకున్న డీటీ నవీన్‌కుమార్, సహకరించిన తాత్కాలిక ఉద్యోగి అంజిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని వారిని కోర్టులో హాజరు పరుస్తామని డీఎస్పీ పేర్కొన్నారు. కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న జాడి సమ్మయ్య అనారోగ్యం పాలు కావడంతో ఆయన కుమారుడు అంజి తండ్రి వంతుకు విధుల నిర్వహణకు హాజరై ఈ కేసులో చిక్కుకోవడం గమనార్హం.

స్థలాలు గుర్తించాలి

వేమనపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వనమహోత్సవంలో మొక్కలు నాటేందుకు స్థలాలు గుర్తించాలని ఎంపీడీవో కుమారస్వామి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందారంలో ఎంపీవో పర్యటన

జైపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఇందారం గ్రామపంచాయ తీలో శుక్రవారం ఎంపీవో శ్రీపతి బాపురావు పర్యటించారు. పంచాయతీ రికార్డులను, పారిశుధ్య పనులను పరిశీలించారు.

నష్టపరిహారం అందజేత

కాసిపేట, జూలై4 (ఆంధ్రజ్యోతి): దేవాపూర్ అటవీసెక్షన్ పరిధిలో గత బుధవారం చిరుత పులిదాడిలో ఆవు మృతి చెందిన రైతు ఆడె జంగుకు శుక్రవారం రూ.6వేల నష్టపరిహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కెదావోజీ సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

మందమర్రిటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాస్, మణిరాం సింగ్, రాజన్న అన్నారు. ఏరియాలోని కేకే ఓసీపీలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. బ్రిటీష్ కాలం నాటి 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చడానికి కేంద్రం యత్నిస్తుందన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం కార్మిక ప్రయోజనాలను పూర్తిగా దెబ్బతీయడంతో పాటు కార్మిక సంఘాలు లేకుండా చేసే కుట్రలకు పూనుకుంటుందన్నారు. ఇప్పటికే బొగ్గు పరిశ్రమల ను ప్రైవేటు వ్యక్తులను కట్టబెడుతూ ఆదాని, అంబానీల ఆస్తులను పెంచుతున్నారన్నారు. కార్మికులందరు సమ్మెలో పాల్గొనాలని, రోడ్లపైకి వచ్చి నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం నాలుగు లేబర్ కోడ్‌లపై ఐఎఫ్‌టీయూ ప్రచురించిన బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు చాంద్‌పాషా, శ్రీనివాస్, సత్యం, అప్సర్‌ఖాన్, రాజన్న, మౌనిక పాల్గొన్నారు.

జైపూర్, (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ ఈ నెల 9న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పిలుపుని చ్చారు. ఐకే 1ఏ, ఐకేపీ ఓసీపీలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లలో పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో సీతారామయ్య, వీరభద్రయ్య, బాజీసైదా, రవీం దర్‌రెడ్డి, స్వామి, రాజారెడ్డి, బాలాజీ, రమేష్, సత్తయ్య, అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాసిపేట (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయుసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కే సమ్మయ్య అన్నారు. శుక్రవారం కాసిపేట గనిపై నిర్వహించిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అనంతరం సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, సీఐటీయు డిప్యూటి జనరల్ సెక్రటరీ నాగరాజు గోపాల్, ఐఎన్‌టీయుసీ సెంట్రల్ కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బన్న లక్ష్మణ్ దాస్, జేఏసీ నాయకులు ఎస్. నాగేశ్వర్‌రావు, వెంకటస్వామి, బడికెల సంపత్, రాజన్న, ఏనుగు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణానికి మేలు చేసేలా మైనింగ్

- సీఎండీ ఎన్ బలరాం

శ్రీరాంపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి, ప్రజలకు మేలు చేసేలా మైనింగ్ చేపడుతున్నట్లు సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అన్నారు. "ఉత్తమ మైన్‌క్లోజర్ పద్ధతుల ద్వారా పర్యావరణహిత, బాధ్యతాయుత మైన్ క్లోజింగ్" అనే అంశంపై హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మైనింగ్ సదస్సులో సింగరేణి అనుసరిస్తున్న విధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయన వివరించారు. తమ సంస్థ పర్యావరణానికి హానికలిగించని సర్ఫేస్ మైనర్, ఇన్ పిట్ క్రషర్, డ్రాగ్‌లైన్, కంటిన్యూయస్ మైనర్, లాంగ్ వాల్ వంటి మైనింగ్ టెక్నాలజీని వినియోగిస్తోందని చెప్పారు. నిబంధనల ప్రకారం ఇప్పటి వరకు 7 కోట్ల 76 లక్షల మొక్కలు నాటి వనాలుగా మార్చామన్నారు. ఓసీపీల నుంచి వచ్చే సుమారు 1205 లక్షల కిలో లీటర్లనీటిలో కంపెనీ అవసరాలకు పోగా, మిగిలిన 820 లక్షల కిలో లీటర్ల నీటిని స్థానిక ప్రజల అవసరాలకు, పంటలు పండించేందుకు, చెరువులు, కుంటలలోకి పంపిస్తున్నట్లు వివరించారు. భూగర్భ జలాల పెంపునకు 62 కొత్త చెరువులను నిర్మించామని, 45 పాత చెరువుల్లో పూడిక తీయించామని తెలిపారు. నీటి సంపులతో సమీప ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరుగుతున్నాయన్నారు. సింగరేణి చేపట్టే భారీ ప్లాంటేషన్, ఇతర పనుల్లో స్థానిక యువతకు అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం బెల్లంపల్లి ఏరియాలోని జోర్రి-1 ఓసీపీ మూసివేసిన తరువాత చేపట్టిన పర్యావరణ చర్యలపై ఒక లఘు డాక్యుమెంటరీ చిత్రాన్ని ప్రదర్శించారు. సదస్సులో సింగరేణి తరఫున డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ రావు, డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్లు, డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు, ఈడీ(కోల్‌మూమెంట్) సుభాని, తదితరులు పాల్గొన్నారు.

జాప్యం లేకుండా సీఎంపీఎఫ్ సేవలు



మాట్లాడుతున్న సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచౌరి

మందమర్రిటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగులకు జాప్యంలేకుండా వెను వెంటనే సీఎంపీ ఎఫ్ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ హరిపచౌరి అన్నారు. శుక్రవారం స్థానిక జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎంపీఎఫ్, పెన్షన్‌లకు సంబంధించిన లావాదేవిలన్నీ సి కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగుతున్నా యన్నారు. కొత్త సీఎంపీఎఫ్,పెన్షన్‌కు సంబంధించిన క్లైయిమ్‌లు త్వరగా పూర్తి చేయడానికి ప్రయాస్ అనే పద్ధతిని ప్రవేశ పెట్టామన్నారు. బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జీరో పెండింగ్‌గా సీఎంపీఎఫ్, పెన్షన్ సంబంధించిన క్లైయిమ్‌లను సెటిల్ చేస్తున్నామన్నారు. . జీఎం దేవేందర్ మాట్లాడుతూ ప్రయాస్ పద్ధతి ద్వారా సీపీఎంఎఫ్, పెన్షన్‌కు సంబంధించిన సమస్యలు లేకుండా చూసేందుకు చర్యలు తీసుకుంటున్న అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, సీఎంపీఎఫ్ రీజనల్ కమిషనర్ గోవర్ధన్, పీఎం శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ శంకర్ సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోశయ్యకు ఘన నివాళి

శ్రీరాంపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం జీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ నివాళులు అర్పించారు. రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్స, డీజీఎం (పర్సనల్) అనిల్‌కుమార్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, డీజీఎం(లా) శిరీషారెడ్డి, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మీ, పర్యావరణ అధికారి హన్మాన్‌గౌడ్, సీనియర్ పీవో కాంతారావు, పిట్ కార్యదర్శి సందీప్ తదితరులు పాల్గొన్నారు.



నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

శ్రీరాంపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు తిప్పారపు సారయ్య అన్నారు. ఆర్కే న్యూటెక్ గనిపై శుక్రవారం కార్మిక సంఘాల జేఏసీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ బ్రాంచ్ కార్యదర్శి పొన గంటి అశోక్, మీన కొమురయ్య, పిట్ కార్యదర్శి తుల అనిల్‌కుమార్, వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, ఐఎఫ్‌టీయూ నాయకులు డి బ్రహ్మానందం, మేకల రాములు, సింగరేణి ఉద్యోగుల సంఘం నాయకులు రాజయ్య, సారయ్య, టీఎస్‌టీయూసీ నాయకుడు రాజబాబు, ఏఐఎఫ్‌టీయూ నాయకులు పోచమల్లు పాల్గొన్నారు.

నేడు పాలిసెట్ కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాజమాన్యం కోటాలో సింగరేణి ఉద్యోగుల పిల్లలు, రిటైర్డ్ ఉద్యోగుల పిల్లలకు 150 సీట్లు(సివిల్-30, కంప్యూటర్స్-30, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్-30, మెకానిక ల్-30, మైనింగ్-30) అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉదయం 8 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందన్నారు. తమ ఆన్‌లైన్ దరఖాస్తుపై సంబంధిత గని/విభాగానికి చెందిన అధికారి సంతకం, జిరాక్స్ కాపీలపై(3 సెట్లు) పాఠశాల హెచ్‌ఎం సంతకం చేయించాలని పేర్కొన్నారు. ఒరిజనల్ సర్టిఫికెట్లతో సీసీసీలోని పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా 17 వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

మొక్కలు నాటిన అధికారులు

రెబ్బెన, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి సింగరేణి ఏరియా గనుల్లో శుక్రవారం సింగరేణి పర్యావరణ, అటవీ శాఖ సలహాదారు అధికారి మోహన్ పరిగన్ శుక్రవారం పర్యటించి జీఎం విజయభాస్కర్ రెడ్డితో కలిసి గోలేటి సీహెచ్‌పీ వద్ద మొక్కలు నాటారు. గోలేటిలోని నర్సరిలో పర్యటించి మొక్కల రకాలు వాటిని సంరక్షిస్తున్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం కె రాజమల్లు, ఏరియా ఎన్విరాన్మెంటు అధికారి హరిష్, జూనియర్ ఫారెస్టు అధికారి సుష్మా తదితరులు పాల్గొన్నారు.



రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఖర్గే, చిత్రంలో సీఎం రేవంత్ రెడ్డి

క్రమశిక్షణకు మారు పేరు రోశయ్య

- యువనేతలకు ఆదర్శం ఆయన జీవితం
- మాజీ సీఎం రోశయ్య 92వ జయంతి సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి, పొన్నం
- చాగంటికి సత్కారంతో పాటు ప్రశంసా పత్రం

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ/ఖైరతాబాద్/రవీంద్రభారతి, జూలై 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు మారు పేరు.. అజాత శత్రువుగా తెలుగు ప్రజల మనసుల్లో సుస్థిరస్థానం సంపాదించుకున్న నేత మాజీ సీఎం కొణిజేటి రోశయ్య అని మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు కొనియాడారు. నేటి యువతరం రోశయ్య రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని, ఉమ్మడి రాష్ట్రంలో 16 సార్లు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టి రికార్డు సృష్టించారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రోశయ్య 92వ జయంతి సభను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, కొణిజేటి రోశయ్య మెమోరియల్ ట్రస్ట్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి మంత్రులు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు తదితరులు నివాళులర్పించారు. అనంతరం ప్రవచన కర్త, ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావును ఘనంగా సత్కరించి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. చాగంటి మాట్లాడుతూ.. రోశయ్య గవర్నర్‌గా ఉన్న సమయంలో చెన్నైలో ప్రవచనాలు చెప్పేందుకు వెళ్లినప్పుడు రాజ్‌భవన్ నుంచి బయటికొచ్చి మరీ ఆయన స్వాగతం పలికారని గుర్తు చేసుకున్నారు. మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి మాట్లాడుతూ.. రోశయ్య ఎప్పుడూ అందరికీ ఆదర్శ నాయకత్వాన్ని అందించే లక్ష్యంతో పనిచేశారని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా ఆదర్శ రాజకీయ నేతగా గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్ మాట్లాడుతూ.. 16 ఏళ్ల అప్పులు చేయకుండా ఉన్న దాంట్లో నిధులు సర్దుబాటు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లిన గొప్ప నేత రోశయ్య అని అన్నారు. ప్రభుత్వం అధికారికంగా ఆయన జయంతి నిర్వహించడం అభినందనీయమని.. ఆయన వాగ్ధాటి, ఛలోక్తులను ఎవరూ మర్చిపోరని చెప్పారు. రోశయ్య ఆలోచనలు, ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలను పార్టీలకతీతంగా ఇప్పుడు అనుసరించాల్సిన అవసరముందని గుత్తా అన్నారు. ఇటు డీజీపీ కార్యాలయంలోనూ రోశయ్య జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రోశయ్య చిత్రపటానికి అదనపు డీజీపీ మహేశ్ భగవత్ పూలమాల వేసి నివాళులర్పించారు.

రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఖర్గే

మాజీ సీఎం రోశయ్య కాంస్య విగ్రహం హైదరాబాద్‌లో ఆవిష్కృతమైంది. లక్డీకాపూల్‌లోని సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో 450 కిలోల బరువుతో ఏర్పాటు చేసిన రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఆయన జయంతి సందర్భంగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆవిష్కరించారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కార్యక్రమానికి హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే దానం నాగేందర్, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, దయానంద్, సీనియర్ నేతలు వి.హన్మంతరావు, కేవీపీ రామచంద్రరావు, టీజీ వెంకటేశ్, ఆర్యవైశ్య మహాసభ తెలంగాణ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, రోశయ్య కుటుంబ సభ్యులు శివసుబ్బారావు, మూర్తి పాల్గొన్నారు.

గ్రూపులు కడతామంటే.. భయపడం!

(మొదటిపేజీ తరువాయి)

కమిటీల ఉమ్మడి, విస్తృత కార్యవర్గ సమావేశాల్లో ఖర్గే దిశానిర్దేశం చేశారు. ఇందులో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి పాల్గొన్నారు.

తెలంగాణ.. కాంగ్రెస్‌కు మోడల్ స్టేట్!

తెలంగాణను కాంగ్రెస్ మోడల్ స్టేట్‌గా దేశానికి చూపనున్నట్టు ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ సైద్ధాంతాలకు అనుగుణంగానే రేవంత్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఆర్థికంగా ఇబ్బందులున్నా హామీలను సమర్థంగా అమలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. నేతలు పార్టీ ఇచ్చిన పదవులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి తీరాలన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ సమావేశంలో చెప్పారు. ఇక రేవంత్ మంత్రివర్గంలో పనిచేయాలన్నది తన కోరికని, జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ చెప్పారు.

మంత్రులపై సీఎం రేవంత్ అసంతృప్తి!

మంత్రులు, ఆయా జిల్లాల్లో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నామినేటెడ్ పోస్టులకు ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి పంపాలని మంత్రులు, పీసీసీ చీఫ్‌ను నాలుగు నెలలుగా కోరుతున్నా.. స్పందించడం లేదని పేర్కొన్నారు. ప్రతిపాదనలు పంపితే వెంటనే ఆమోదిస్తానని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడగానే ప్రతిపాదనలను షార్ట్ లిస్ట్ చేసి ఉంటే.. నామినేటెడ్ పోస్టుల్లో ఒక టర్మ్ అవకాశాలు పూర్తయ్యేవని వివరించారు.

నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టుల భర్తీ:ఖర్గే

జూలై నెలాఖరుకల్లా నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాలని సీఎం రేవంత్, మంత్రులు, టీపీసీసీ చీఫ్‌కు ఖర్గే స్పష్టం చేశారు. దీన్ని సమన్వయం చేసుకునే బాధ్యత పీసీసీ చీఫ్‌దేనని.. పార్టీ కోసం కష్టపడిన వారికి, సమర్థులకే పదవులు ఇవ్వాలని సూచించారు. 'ప్రభుత్వంపై పార్టీ ఫిర్యాదు చేయడం చూశాం గానీ, పార్టీపై ప్రభుత్వం ఫిర్యాదు చేయడం ఇక్కడే చూస్తున్నా' అని ఖర్గే వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేసేందుకు చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌కు ఖర్గే సూచించారు. పార్టీకి కార్యకర్తలే బలమని, కాపాడుకోవాలని చెప్పారు.



గాంధీభవన్ చేరుకున్న కాంగ్రెస్ చీఫ్ ఖర్గేతో సీఎం రేవంత్

పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దు: సీఎం

నేతలు పార్టీ పదవులను తేలికగా తీసుకోవద్దని సీఎం రేవంత్ సూచించారు. పార్టీ పదవులతో గుర్తింపు, గౌరవం దక్కుతాయని, రాజకీయాల్లో ఎదుగుదలకు దోహదపడతాయని చెప్పారు. భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లు పెరుగుతాయని, ఎక్కువ మందికి అవకాశాలు వస్తాయని వివరించారు. నూతన నాయకత్వానికి 2029 ఎన్నికలు వేదిక కావాలని కోరారు. అందరూ కష్టపడి పనిచేసి.. కాంగ్రెస్‌ను రెండో సారి అధికారంలోకి తీసుకురావాలన్నారు. రాష్ట్రంలో వచ్చే పదేళ్లు కాంగ్రెస్‌దే అధికారమని ధీమావ్యక్తం చేశారు. పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ మాట్లాడుతూసామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 90 సీట్లతో అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

అనిరుధ్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏం చేద్దాం?

ఈ నెల 7న క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ

తెలంగాణలో టీడీపీ కోవర్టులున్నారంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులపై టీపీసీసీ క్రమశిక్షణా చర్యల కమిటీ జూలై 7న గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఆధారాలు చూపకుండా అనిరుధ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణిస్తోందంటూ టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఇప్పటికే ప్రకటించారు. పార్టీ ఎమ్మెల్యే అయినందున.. అనిరుధ్‌రెడ్డికి క్రమశిక్షణా చర్యల కమిటీ షోకాజ్ నోటీసు జారీ చేస్తుందా లేక చర్యల కోసం ఏఐసీసీ క్రమశిక్షణా కమిటీకి సిఫార్సు చేస్తుందా అన్నది చర్చనీయాంశంగా మారింది. ఇలా ఉంటే గాంధీభవన్‌లో చైర్మన్ మల్లురవి అధ్యక్షతన క్రమశిక్షణా చర్యల కమిటీ భేటీ అయింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నేతల వివాదంపై పార్టీ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అభిప్రాయం సేకరించింది. అనంతరం మీడియాతో నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో తాజా రాజకీయ పరిస్థితులపై కమిటీ పెద్దలు తనతో మాట్లాడారన్నారు. చిన్న చిన్న బేధాభిప్రాయాలు మాత్రమే ఉన్నాయని, త్వరలో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయని చెప్పారు.

డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు చారిత్రాత్మక మైలురాయి

- సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్

హైదరాబాద్/సైదాబాద్/యాదగిరిగుట్ట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): నేరాలు పాల్పడి జైలుకు వచ్చిన వారిలో పరివర్తన తీసుకురావడమే లక్ష్యంతో రాష్ట్ర జైళ్లలో డీ అడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేయడం చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి, నేషనల్ లీగల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. చంచల్‌గూడ జైలులో నివృత్తి డీ అడిక్షన్ సెంటర్‌ను శుక్రవారం హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. మత్తుకు బానిసైన ఖైదీలకు వైద్య చికిత్స కౌన్సిలింగ్‌ల ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా డీ అడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అభినందనీయమని చెప్పారు. జస్టిస్ సుజోయ్‌పాల్ మాట్లాడుతూ ఖైదీలు మత్తు వ్యసనాన్ని అధిగమించి వారి జీవితాలను పునర్నించడానికి సహాయపడే వాతావరణం చంచల్‌గూడ జైలులో ఉందని ప్రశంసించారు. కాగా, అంతకు ముందు యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని జస్టిస్ సూర్యకాంత్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేద ఆశీర్వచనం చేశారు. గర్భాలయంలో స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్నిన్యాయమూర్తికి అందజేశారు. కాగా, బాలల హక్కుల రక్షణ అంశంపై 'వాయిస్ ఫర్ ది వాయిస్ లెస్' అనే పేరుతో శని, ఆదివారాల్లో రాష్ట్ర స్థాయి స్టేక్ హోల్డర్ల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు సుప్రీం కోర్టు జడ్జి జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సదస్సులో సీఎం రేవంత్ రెడ్డి, హై కోర్ట్ చీఫ్ జస్టిస్ సుజోయ్ పాల్, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొననున్నారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు నృసింహుడి చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ ఈవో

34 కోట్ల రన్యారావ్ ఆస్తులు అటాచ్ చేసిన ఈడీ

బెంగళూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి): బంగారం అక్రమ రవాణా కేసులో పట్టుబడిన నటి రన్యారావ్‌కు చెందిన రూ.34.12 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. బెంగళూరు విక్టోరియా లే అవుట్‌లోని ఇల్లు, ఆర్కావతి లే అవుట్‌లో స్థలం, తుమకూరులో పారిశ్రామిక స్థలం, ఆనేకల్ తాలూకాలోని వ్యవసాయ భూమిని అటాచ్ చేశామని ఈడీ అధికారులు శుక్రవారం ప్రకటించారు. దుబాయ్ నుంచి రూ.12.56 కోట్ల విలువైన బంగారాన్ని తెస్తూ.. ఈఏడాది మార్చి 3న కెంపేగౌడ విమానాశ్రయంలో రన్యారావ్ పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో రన్యారావ్, రాజు, సాహిల్‌జైన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ముగ్గురూ పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు.

తెరుచుకున్న తుంగభద్ర గేట్లు!

గద్వాల/దోమలపెంట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ ప్రాజెక్టులకు క్రమంగా వరద పెరుగుతోంది. కృష్ణా, తుంగభద్ర నదుల ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద పెరుగుతోంది. శుక్రవారం కర్ణాటకలోని తుంగభద్ర గేట్లు తెరుచుకున్నాయి. ప్రాజెక్టుకు 75,612 క్యూసెక్కుల ప్రవాహాలు చేరగా 58 గేట్లకు గాను 21 గేట్లను ఎత్తి 62,612 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 105.79 టీఎంసీలకు.. ప్రస్తుతం 75.84 టీఎంసీలున్నాయి. దిగువనున్న శ్రీశైలం ప్రాజెక్టుకు 1,09,777 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా ఏపీ, తెలంగాణ విద్యుదుత్పత్తి కోసం 56,998 క్యూసెక్కులను వినియోగిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలకు ప్రస్తుతం 169.86 టీఎంసీలున్నాయి. తుంగభద్ర గేట్లు తెరవడంతో శ్రీశైలానికి వరద మరింత పెరిగే అవకాశముంది. ఇక ఆల్మట్టికి వరద స్థిరంగా కొనసాగుతోంది. 94,767 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కులను దిగువకు విడుస్తున్నారు. జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ప్రవాహాలు వస్తుండగా 14గేట్ల ద్వారా 95,566, విద్యుదుత్పత్తి ద్వారా 29,494 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు.

బ్రిడ్జిలు, సొరంగాలున్న హైవేలపై టోల్ చార్జీలు సగానికి తగ్గింపు

న్యూఢిల్లీ, జూలై 4: జాతీయ రహదారులపై సొరంగాలు, బ్రిడ్జిలు, ఫ్లైఓవర్లు లేదా ఎలివేటెడ్ హైవేలు వంటి నిర్మాణాలున్న భాగాలకు టోల్ రేట్లను కేంద్ర ప్రభుత్వం 50శాతం వరకు తగ్గించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ టోల్ చార్జీలను లెక్కించడానికి కొత్త పద్ధతి/ఫార్ములాను నోటిఫై చేస్తూ ఈ నెల 2న నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం.. జాతీయ రహదారిపై ఉండే ప్రతి కిలో మీటరు వంతెనలు లేదా సొరంగాలకు వాహనదారులు సాధారణ టోల్ కన్నా పది రెట్లు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీన్ని సవరిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సొరంగాలున్న ప్రాంతాల్లో టోల్ రేటును 50 శాతం వరకు తగ్గించినట్టు ఓ అధికారి పేర్కొన్నారు.

అనారోగ్యంతో ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి

మంచిర్యాల క్రైం, జూలై 4: అనారోగ్యంతో ఓ వ్యక్తి ఈనెల 2న ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా వీణవంకకు చెందిన కాంపెల్లి శ్రీనివాస్(33)కు అయిన వాళ్లు ఎవరూ లేరు. కొన్నేళ్లుగా మంచిర్యాలలోని హమాలీవాడలో ఉంటూ కూలి పని చేసుకుంటున్నాడు. ఇటీవల అనారోగ్యంతో ఉండడంతో ఆస్పత్రికి వెళ్లగా శ్రీనివాస్‌కు వైద్యం అందించారు. కుదుటపడకపోవడంతో మనస్థాపంతో ఈనెల 2న పురుగుల మందు తాగాడు. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతదేహాన్ని మున్సిపాలిటీ సిబ్బంది దహనం చేశారు.

మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు

కాసిపేట, జూలై4 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు మోతాదుకు మించి రసాయనిక ఎరువులు వాడితే చీడపీడలతో పాటు రసం పీల్చే పురుగులు పంటలను ఎక్కువగా ఆశిస్తాయని మండల వ్యవసాయ అధికారి చల్ల ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కాసిపేటలో పత్తి రైతులకు యాజమాన్య పద్ధతులు, చీడ పీడల స్వచ్ఛ రక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. మోతాదుకు మించి అధిక ఎరువులు వాడడం వల్ల చీడ పీడల ఉధృతి ఎక్కువై పంట దిగుబడి తగ్గుతుందన్నారు. యూరియాకు బదులుగా నానో యూరియా ప్లస్ వావాడాలన్నారు. రైతులు పత్తి పంటలో అంతర్ పంటలుగా పండి పెసర, మినుము, సోయా లాంటి పంటలను సాగు చేసుకోవడంలో రైతుకు ఆర్థిక స్థిర త్వం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీధర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు

మందమర్రి, జూలై4 (ఆంధ్రజ్యోతి): చెన్నూర్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌తో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారామేశ్‌పై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ రాజుకుమార్, పంబాల మధు పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చెన్నూర్ రూపురేఖలు మార్చిన ఘనత బాల్కసుమన్‌దే అన్నారు. జంపన్న, చిరంజీవి, సిరోజ్, తిరుపతి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

చెన్నూరు రూరల్ సీఐగా బన్సీలాల్

కోటపల్లి, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు రూరల్ సీఐగా ఆర్. బన్సీలాల్ శుక్రవారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇంతకాలం ఇక్కడ సీఐగా పనిచేసిన సుధాకర్ జగిత్యాల రూరల్ సీఐగా బదిలీ కాగా హైద్రాబాద్‌లోని ఐజీపీ కార్యాలయంలో పనిచేస్తున్న బన్సీలాల్ కోటపల్లికి బదిలీపై వచ్చారు. అందరి సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు. కోటపల్లి ఎస్ఐ రాజేందర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్‌లు సీఐ బన్సీలాల్‌కు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు.

ఘనంగా పీరీల ఊరేగింపు

జన్నారం, జూలై4 (ఆంధ్రజ్యోతి): మొహర్రం సందర్భంగా మండల కేంద్రంలో పీరీల ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. మతతత్వం లేకుండా పీరీల ఊరేగింపు ప్రతి సంతవ్సరం నిర్వహిస్తారు. అయితే ఈ సంవత్సరం మండలంలోని కామన్‌పల్లి, కలమడుగు, పొన్కల్, జన్నారం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు ఈసందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

మంచిర్యాలక్రైం,జూలై4(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం పాత మంచిర్యాల 9వ వార్డులో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ బొలిశెట్టి సునితా కిషన్‌లు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీనగర్ కాలనీలో డ్రైనేజీ లేకపోవడం వల్ల వర్షపు నీరు ఆగడంతో జేసీబీ ద్వారా తాత్కాలిక కాలువను తీయించారు. ఇంటి యజమాని గోదారి లక్ష్మీ, వార్డు అధ్యక్షులు ఎడ్ల మల్లేశ్, నాయకులు ఉన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి వేడుకలు

మందమర్రిటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య జయంతి వేడుకలను శుక్రవారం స్థానిక జీఎం కార్యాలయంలో అధికారులు ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి జీఎం దేవేందర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీఎం మాట్లాడుతూ ఆర్థికమంత్రిగా, ముఖ్యమంత్రిగా, గవర్నర్‌గా రోశయ్య అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సలేంద్ర సత్యనారాయణ, పీఎం శ్యాంసుందర్, ఏఐటీయూసీ సభ్యులు రమణ పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని ఐబీలో ఆర్యవైశ్య అఫీసియల్స్ అండ్ ప్రొఫేషనల్ ఆధ్వర్యంలో రోశయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆవోపా అధ్యక్షుడు కొత్త కిరణ్ కుమార్, సభ్యులు గుండ ప్రభాకర్, రాజమౌళి, రవీందర్, సత్యనారాయణ, సుదర్శన్, సత్తయ్య పాల్గొన్నారు.

జైపూర్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం రోశయ్య జయంతి వేడుకలకు శుక్రవారం ఎస్టీపీపీలో ఘనంగా నిర్వహించారు. రోశయ్య చిత్రపటానికి ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధికారులు జేఎన్ సింగ్, సత్యనారాయణ, సంతోష్‌కుమార్, మురళీధర్, మదన్‌మోహన్, కిరణ్‌బాబు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య రాజకీయ దురందరుడని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. ఆయన జయంతి సందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఎంతో గొప్ప వ్యక్తిత్వం ఎన్నో పదవులు ఉత్తమ విలువలతో ఆ పదువులకే వన్నె తెచ్చాడన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పదహారు సార్లు ఆర్థిక మంత్రిహోదాలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచి ఏసీపీ మల్లారెడ్డి, సీఐ రాజేంద్రప్రసాద్, భీమేశ్‌లు పాల్గొన్నారు.



మందమర్రిలో రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు

వ్యాపార విస్తరణలో సింగరేణి అగ్రభాగంలో ఉండాలి

మందమర్రిటౌన్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణకే తలమానికమైన సింగరేణి సంస్థ వ్యాపార విస్తరణ విభాగాల్లో అగ్రభాగంలో ఉండాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని సింగరేణి భవన్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన పరిశోధన విస్తరణ సంస్థ నాన్ ఫెర్రస్ మెటీరియల్స్ టెక్నాలజీ డెవలప్‌మెంట్‌సెంటర్ (ఎన్ఎఫ్ డీసీ)తో కీలక ఖనిజాలు, అరుదైన మూలకాల పరిశోధన ఉత్పత్తికి సంబంధించి సింగరేణి సంస్థ ప్రాథమిక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమానికి హాజరైన కేంద్రమంత్రి మాట్లాడుతూ ఇప్పటి వరకు బొగ్గు, థర్మల్, సోలార్ విద్యుత్ రంగాల్లో రాణిస్తున్న సింగరేణి సంస్థ రాబోయే కాలంలో వ్యాపారాలను మరింత పెంచాలన్నారు. కీలక ఖనిజాలు, అరుదైన భూ గోళకాలు (రేర్ ఎర్త్ఎలిమెంట్‌లు) ఉత్పత్తి చేపట్టి దేశంలో అగ్రగామిగా నిలవాలన్నారు. కొన్ని ఓపెన్ కాస్టు గనుల్లో ఫ్లైయాష్, బాటమ్‌యాష్‌లను ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కొన్ని గుట్టల్లో రేర్ ఎర్త్ఎలిమెంట్లు ఉ న్నట్లు కనుగొన్నామని, వీటి మూలకాలను వెలికితీయడం కోసం ఈ ఒప్పందం ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ

బెల్లంపల్లి, జూలై4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోటస్ పాఠశాలలో చదివే అక్షయ అనే విద్యార్థిని రాష్ట్ర సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ అండర్-8ఇయర్స్ లాంగ్ జంప్ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించింది. ఇందుకు గాను పాఠశాల ఉపాధ్యాయులు అక్షయను అభినందించారు. రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్‌తో పాటు జిల్లా స్థాయిలో మొదటిస్థానంలో రాణించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

ఇక కొత్త రేషన్ కార్డులు..

(5వ పేజీ తరువాయి)

రేషన్ కార్డు తప్పనిసరి చేసింది. అలాగే రాజీవ్ యువ వికాసం కింద యువతకు రుణాల మంజూరు కోసం కూడా రేషన్‌కార్డును అనుసంధానం చేశారు. ఓ వైపు ఆ పథకాలను అమలు చేస్తున్న ప్ర భుత్వం మరోవైపు రేషన్ కార్డులు జారీ చేయక పోవడంతో అనేక మంది అనర్హులుగా మిగిలిపోయారు. చివరకు రైతు రుణమాఫీ కూడా జరుగక ఇబ్బందులు పడ్డారు.

జిల్లాలో 26వేల మంది దరఖాస్తు...

జిల్లాలో రేషన్ కార్డుల కోసం 26,116 మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో ఇప్పటి వరకు 16,669 కార్డులను అధికారులు అప్రోవ్ చేయగా, మరో 8600 కార్డులు పెండింగ్‌లో ఉన్నాయి. దరఖాస్తుల్లో అర్హతలేని 847 కార్డులను అధికారులు తిరస్కరించారు. అయితే ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించి పది నెలలు గడుస్తున్నా మూడో వంతు కార్డులను మాత్రమే అధికారులు అప్రోవల్ చేయడం గమనార్హం. తిరస్కరణకు గురికాగా, మిగిలిన ఎనిమిదివేల పై చిలుకు దరఖాస్తులు మంత్రి ప్రకటించిన గడువులోగా పూర్తవుతాయా...?అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ నిర్ణీత తేదీలోగా దరఖాస్తుల ప్రక్రియ పూర్తిగాని పక్షంలో మిగిలిన దరఖాస్తుదారుల పరిస్థితి ఏమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దరఖాస్తు పరిశీలన త్వరితగతిన పూర్తిచేయా లని విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి.

వన మహోత్సవం లక్ష్యాలను చేరుకోవాలి

కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, జూలై4 (ఆంధ్రజ్యోతి): వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం లక్ష్యాలను పూర్తి స్థాయిలో సాధించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కర్నమామిడి గ్రామ పంచాయతీలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ ఆవరణలో వన మహోత్సవం 2025 కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, డీఈవో యాదయ్య, ఎంపీడీవో ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యాన్ని కాపాడుతూ భావితరాలకు సహజసిద్ధమైన వాయువును అందించేందుకు ప్రభుత్వం వన మహోత్సవం కార్యక్రమం ద్వారా మొక్కలు నాటుతామని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు.

జిల్లాలోని ఆయా శాఖలకు మొక్కలు నాటేందుకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసే విధంగా అధికారులు, సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ పీవో మల్లయ్య, ఈసీ శ్రీనివాస్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్‌లు పాల్గొన్నారు.



కేజీబీవీలో మొక్కలు నాటుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

సంక్షిప్త సమాచారం

తాండూర్ : మండలంలోని అచ్చలాపూర్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు శుక్రవారం పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు అర్థం సాంబమూర్తి తన సొంత ఖర్చులతో టై, బెల్టులను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తెలిపారు.

దండేపల్లి: మండలం ద్వారక స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని దొరగారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 36 మంది పేద విద్యార్థులకు స్కూల్ టై, బెల్టులతో పాటు తెలుగు, ఇంగ్లీష్ కర్సివ్ రైటింగ్ బుక్‌లను ద్వారక స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు చిన్న నరసయ్య చేతుల మీదిగా పంపిణీ చేశారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసారు. కార్యాలయంలో పని చేసే సిబ్బందితో పాటు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేసారు. పీహెచ్‌సీ వైద్య అధికారి సతీష్, మున్సిపల్ మేనేజర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ఎంఈవో దత్తుమూర్తి శుక్రవారం తనిఖీ చేశారు. ఆదిల్‌పేటలోని పాఠశాలను తనిఖీ చేసి హాజరు రిజిష్టర్‌లను పరిశీలించారు.

జన్నారం: నిఘా కెమెరాలను అమర్చుకోవడం వల్ల భద్రత పెరగడంతో పాటు నిఘా వ్యవస్థ పటిష్టంగా ఉంటుందని ఎస్ఐ అనూష అన్నారు. శుక్రవారం మండల ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్ఐ ప్రారంభించారు.

● మండలంలోని పొన్కల్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణాలను శుక్రవారం ఇందిరమ్మ గృహ నిర్మాణ ఏఈ లాయక్ అలీ పరిశీలించారు. ఈవో రాహుల్ పాల్గొన్నారు.

బెల్లంపల్లి: హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జైబీం జై సంవిధాన్ కార్యక్రమానికి శుక్రవారం బెల్లంపల్లి పట్టణంతో పాటు మండల నాయకులు భారీగా తరలివెళ్లారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి బయలు దేరినట్లు టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి అన్నారు. ఆయనతో పాటు మాజీ కౌన్సిలర్ గెల్లి రాజలింగు వెళ్లారు.

దండేపల్లి : సామాజిక న్యాయ జై బాపు జై భీమ్ జైసం విధాన్ సమరభేరి సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే సభకు మండల నుంచి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివెళ్లారు.



రేపు నస్పూర్ కాలనీలో ఉచిత వైద్య శిబిరం

నస్పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని వసుధ హాస్పటల్ ఆధ్వర్యంలో 6వ తేది ఆదివారం నస్పూర్ కాలనీలోని సీతారాముల కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు శిబిరం నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక వైద్యుల బృందం శిబిరంలో పాల్గొని వివిధ రకాల వ్యాధులకు సంబందించిన ఉచితంగా పరీక్షలు, మందులు పంపిణీ చేస్తామన్నారు. శిబిరంలో పాల్గొన్న వారికి 6,7వ తేదిల్లో ప్రత్యేక రాయితీలతో అనేక రకాల పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

నియామకం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణంలోని గౌతమినగర్‌కు చెందిన బీజేపీ నాయకులు వెరబెల్లి రవీందర్‌రావు తెలంగాణస్టేట్ ఫిల్మ్‌చాంబర్ ఆఫ్‌కామర్స్ కమిటీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు చాంబర్ సెక్రటరీ శ్రీధర్ ఆయనకు నియామక పత్రం అందించారు.

రైతులకు విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో సంగీత

జన్నారం, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు శుక్రవారం జాతీయ ఆహారభద్రత పథకంలో భాగంగా నాలుగు కేజీల కంది బ్యాగులను రైతులకు ఏవో సంగీత అందజేశారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా రైతులకు విత్తనాలను పంపిణీ చేయడం జరుగుతుందని దీనివల్ల ఈ కందిని పొలంగట్లపై వేసుకోవడంతో పాటు అంతర్‌పంటగా వాడుకోవడంవల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. అంతర్ పంట వినియోగం వల్ల పత్తి రైతులకు భూసారం పెరుగుతుందని యూరియా ఖర్చులు తగ్గుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సంధ్య, దివ్యతో పాటు రైతులు తదితరులు పాల్గొన్నారు.



- ఈ నెల 14 నుంచి జారీకీ సన్నాహాలు
- మంత్రి ప్రకటనతో ఏర్పాట్లలో అధికారులు
- జిల్లాలో 26వేల దరఖాస్తులు

మంచిర్యాల, జూలై 4 (ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ఈ నెల 14 నుంచి కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రెండు రోజుల క్రితం ప్రకటించారు. దీంతో ఆ ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమై ఉంది. ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తరేషన్ కార్డులకోసం ప్రభుత్వం దరఖాస్తులను స్వీకరించింది. అయితే 10నెలలు గడుస్తున్నా అర్హుల జాబితా తయారీతోనే సరిపెట్టింది. దీంతో జాబితాలో పేర్లున్న లబ్ధిదారులు కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వాలు ఇప్పుడిస్తాం...అప్పుడిస్తాం అంటూ కాలం వెళ్లదీయడమే తప్ప కార్డులు మాత్రం అందజేయడం లేదు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగా కుటుంబాలు వేరు పడిన వారితో పాటు కొత్తగా వివాహం చేసుకున్న వారు రేషన్ కార్డులు ఎప్పుడెప్పుడు జారీ చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో అమలయ్యే చాలా ప్రభుత్వ పథకాలకు రేషన్ కార్డు లింక్ ఉండటంతో ఆశావహులు వీటి కోసం నిరీక్షిస్తున్నారు.

నాలుగేళ్లుగా సాగదీత ధోరణి...

రాష్ట్రంలో గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వాలు రేషన్ కార్డుల జారీ విషయంలో సాగదీత ధోరణిని అవలంబిస్తున్నాయి. దరఖాస్తులు స్వీకరించడం, ఆ తరువాత వాటిని పక్కన బెట్టడం అలవాటుగా మారింది. రేషన్ కార్డుల జారీ విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వ బాటలోనే కాంగ్రెస్ కూడా పయనిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఎప్పటికప్పుడు తేదీలు ప్రకటించడం, తరువాత విస్మరిస్తుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం దాటవేసే ధోరణిని అవలంబిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 2018 వరకు రేషన్ కార్డుల జారీ ప్రక్రియ యథావిధిగా కొనసాగింది. ఆ సంవత్సరం డిసెంబర్‌లో జరిగిన ముందస్తు అసెంబ్లీ ఎన్నికల అనంతరం మళ్లీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ రేషన్‌కార్డుల జారీ ప్రక్రియను నిలిపివేసింది. ఆ తర్వాత వేల సంఖ్యలో దరఖాస్తులు రావడంతో చివరిసారిగా 2022లో అతి కొద్ది మందికి మాత్రమే కొత్త రేషన్ కార్డులు అందాయి. ఆ తరువాత సంబంధిత వెబ్‌సైట్‌ను శాశ్వతంగా మూసివేయడంతో దరఖాస్తులు కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి.

సంక్షేమ పథకాలకు రేషన్ కార్డుతో లంకె...

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల అమలులో కొన్నింటికి రేషన్ కార్డుతో లంకె పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న రూ.500కే సబ్సిడీ వంట గ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ లాంటి పథకాలకు...

(తరువాయి 7లో)

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

లక్షెట్టిపేట, జులై 4(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్క విద్యార్థి పట్టుదల క్రమశిక్షణతో చదువుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ విద్యార్థులను సూచించారు. శుక్రవారం లక్షెట్టిపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ కళాశాల పాఠశాలను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతులపై విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యపై దృష్టిపై ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతుందని ఎంతో ఖర్చు చేసి విద్యార్థులకు మంచి విద్యను అందించడం కోసం అన్ని హంగులతో భవనం నిర్మించిందన్నారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం ఎంచుకుని ఆలక్ష్య సాధన కోసం చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలను సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలన్నారు. ఈకార్యక్రమం లో కలెక్టర్ వెంట తహసీల్దార్ దిలీప్ కుమార్, ప్రిన్సిపల్ లక్ష్మన్‌రావు, హెచ్‌ఎం వేణుగోపాల్‌తో పాటు అధ్యాపకులు ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

వసతి గృహాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలి

మంచిర్యాల కలెక్టరేట్ : ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న పాఠశాలలు, వసతి గృహాలకు సొంత భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతన మెను ప్రకారం సకాలంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో యాదయ్య, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి దుర్గా ప్రసాద్, మైనార్టీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, గిరిజన అభివృద్ధి అధికారి జనార్దన్ పాల్గొన్నారు.

'జిల్లాలో ఏరులై పారుతున్న మద్యం'

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాలో మద్యం, గుడుంబా ఏరులై పారుతుందని, అధికారులు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యం బారినపడి అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. ఈనెల 3న ఒక్కరోజే మద్యం కారణంగా ఇద్దరు చనిపోవడం బాధాకరమన్నారు. జిల్లా కేంద్రంలో 19 సంవత్సరాల యువకుడు ఆత్మహత్య చేసుకోవడం, కన్నెపల్లి మండలంలో మద్యం మత్తులో భార్యను నరికి చంపిన ఘటనలు చూస్తుంటే జిల్లాలో ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయో అర్థమవుతుందన్నారు. గంజాయి బారిన పడి యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో గొడవలు, కొట్లాటలు, మత్తులో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వం కానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మద్యం, గుడుంబా, గంజాయి నియంత్రణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీనివాస్, రంజిత్‌కుమార్, మోహన్ పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరం

- మున్సిపల్ కమిషనర్ రాజలింగు



బీపీ చెక్ చేయించుకుంటున్న మున్సిపల్ కమిషనర్

మందమర్రి టౌన్, జూలై4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటిలో పని చేస్తున్న కార్మికుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజ లింగు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కార్మికులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్య సిబ్బంది ఆరోగ్యంగా ఉండేందుకు ఈ పరీక్షలు చేస్తున్నామన్నారు. దోమల నివారణకు సంబంధించి మున్సిపాలిటి ప్రత్యేకచర్యలు చేపడుతోందన్నారు. హెల్త్ ఆఫీసర్ శిరీష మాట్లాడుతూ సిబ్బంది ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యంగా ఉండకూడదని తెలిపారు. అనంతరం సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్‌కూడ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైద్య సిబ్బందితో పాటు మున్సిపల్ ఇంజనీర్ సుమతి, రెవెన్యూ ఆఫీసర్ కిష్టప్రసాద్, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు గోపీక్రిష్ణ, పీఎంసీ రఘురాము, మెడికల్ ఆఫీసర్ రమేశ్ పాల్గొన్నారు.

50 శాతం సీలింగ్ రిజర్వేషన్లను ఎత్తివేయాలని సంతకాల సేకరణ



సీసీసీ కార్నర్ వద్ద సంతకాల సేకరణలో పాల్గొన్న బీసీ సంఘ నాయకులు

నస్పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 50శాతం రిజర్వేషన్లను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ నస్పూర్ పట్టణం సీసీసీకార్నర్ వద్ద శుక్రవారం జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ విద్యా ఉద్యోగ స్థానిక సంస్థల్లో చట్టసభల్లో జనాభ ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించాలన్నారు. సీలింగ్ రిజర్వేషన్లను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మల శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు వెంకటయ్య, నాయకులు భీమేష్, అశోక్, చంద్రమౌళి, సతీష్, వంశీ, రాజ్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు ముగిసిన శిక్షణ



సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో, తహసీల్దార్, బీఎల్‌వోలు

నస్పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్, హాజీపూర్ మండలాల బూత్‌స్థాయి అధికారులకు సీసీసీ సింగరేణి అతిథిగృహం హాల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంచిర్యాల రెవెన్యూ డివిజనల్ అధికారి గూడూరి శ్రీనివాసరావు హజరై బీఎల్‌వోలకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఈ శిక్షణ సమావేశంలో తహసీల్దార్ సంతోష్‌కుమార్, డిప్యూటి తహసీల్దార్ హరిత, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు చందర్, హాజీపూర్ డిప్యూటి తహసీల్దార్ ఆసీఫ్, ఆర్ఐ ప్రభు, మాస్టర్ ట్రైనర్స్ సత్తయ్య, భరత్, నస్పూర్, హాజీపూర్ మండలాలకు చెందిన బీఎల్‌వోలు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అభివృద్ధి



రచ్చబండ కార్యక్రమంలో బీజేపీ నాయకులు

చెన్నూరు, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మోదీ 11 సంవత్సరాల పాలన ముగిసిన సందర్భంగా శుక్రవారం చెన్నూరు పట్టణంలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ ఆర్థిక విధానాల కారణంగా ప్రపంచంలో భారత్ నాలుగో ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. స్వచ్ఛ భారత్‌లో ప్రతి ఇంట్లో టాయిలెట్లు నిర్మాణం చేయించి మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడారన్నారు. ప్రతి వ్యక్తికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా అందించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, బత్తుల సమ్మయ్య, వెంకటేశ్వర్, చారి, తిరుపతి, రాజేశ్వర్, వెంకట నర్సయ్య, శ్రీనివాస్, రాజు, శంకర్, దుర్గా ప్రసాద్, రాజబాపు, చిరంజీవి, శ్రీకాంత్, వెంకటేష్, చరణ్‌సింగ్, పోచన్న పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

దండేపల్లి జూలై 4(ఆంధ్రజ్యోతి): 18ఏళ్ల నిండిన ప్రతీఒక్కరికి ఓటు హక్కు కల్పించేందుకు బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్‌వో) కృషి చేయాలని మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు సూచించారు. దండేపల్లిలో స్థానిక ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలలోని మండలస్థాయి బీఎల్‌వో ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు శుక్రవారం ఓటు హక్కునమోదు కార్యక్రమంపై వారికి శిక్షణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆర్డీవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనల మేరకు గ్రామాల్లో బీఎల్‌వో తప్పులు లేకుండా బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. అనంతరం ట్రైనర్లు చిట్ల రాజిరెడ్డి ఓటుహక్కు నమోదు తదితర అంశాలపై వారికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రోహత్ దేశపాండే, డిప్యూటి తహసీల్దార్ మాధవి, ఆర్ఐ బోద్దుల భూమన్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రుల శ్రీనివాస్, శిక్షకులు రాజిరెడ్డి పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్‌రావు

వన మహోత్సవం లక్ష్యాలను చేరుకోవాలి 7

నేడు ఓపెన్ ప్లాట్ల బహిరంగ వేలం

నస్పూర్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో హౌసింగ్ కాలనీలోని ఖాళీగా ఉన్న ప్లాట్లను శనివారం నస్పూర్ గేట్ వద్ద గల ఫంక్షన్ హాల్‌లో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు హౌసింగ్ బోర్డు కార్యనిర్వహక ఇంజనీర్ (ఈఈ-వరంగల్) అంకంరావు తెలిపారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శనివారం ఉదయం 11.30 గంటలకు వేలం పాట ప్రారంభం అవుతుందని, ఆసక్తి కలిగిన వారు నిర్ణీత సమయంలో డీడీలను తీసుకుని వేలంలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో వర్క్ ఇన్స్‌పెక్టర్ అజయ్ ప్రసాద్, ఏఈ పృథ్వీ పాల్గొన్నారు.

భక్తిభావం.. తొలి ఏకాదశి పర్వదినం

- చాతుర్మాస దీక్షలు ప్రారంభం
- ఆలయాల్లో పూజలు గృహాల్లో విందులు

నస్పూర్, జూలై 4: ఆషాఢ శుద్ధ ఏకాదశి తొలి ఏకాదశి పర్వదినాన్ని ఆదివారం జరుపుకోనున్నారు. తొలి ఏకాదశి నుంచే పండుగలు ప్రారంభం అవుతాయి. శయన ఏకాదశిగా పిలిచే ఈ రోజు పాలకడలిలో శ్రీమన్నారాయణుడు శయనించి కార్తీక శుద్ధ ఏకాదశినాడు మేలుకొంటాడని శాస్త్రాలు చెబుతున్నాయి. చాతుర్మాస్య దీక్షల్లో భాగంగా గృహస్థులు, స్వామీజీలు, యతీశ్వరులు, పీఠాధిపతులు 4నెలలకు పైగా దీక్షలో ఉంటారు. ఏడాదిలో వచ్చే 24ఏకాదశిలలో తొలి ఏకాదశికి విశిష్టత ఉంది. ఈ మాసం, వాతావరణం తొలకరి ప్రారంభంతో వర్షాలు కురిసి పంటలకు అనుకూలంగా మారుతాయి. దైవానుగ్రహానికి, పండుగల ప్రారంభానికి కారణమైన ఈ రోజున ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు, హవనాలు నిర్వహిస్తారు. నదీ స్నానాలు, పుణ్య క్షేత్రదర్శనాలు, వ్రతాలు, దానధర్మాలు ఆచరిస్తారు.

ఇళ్లలో పిండి వంటల విందులు, కబుర్లతో కాల క్షేపం చేస్తారు. రైతులు వేడుకగా జరుపుకునే ఈ ఏకాదశినే పూర్వం సంవత్సరారంభంగా పరిగణించేవారు. ప్రకృతి వైపరీత్యాలు రావద్దని, పంటలకు తెగుళ్లు సోకవద్దని రైతులు ప్రార్థిస్తారు.



- వేడుకలకు దేవాలయాలు సిద్ధం..

పంచాంగంలో నెలకు రెండు చొప్పున 24 ఏకాదశిలు వస్తాయి. అయినప్పటికి తొలి ఏకాదశి, ముక్కోటి ఏకాదశిని ఎంతో విశిష్టంగా జరుపుకుంటారు. ఏకాదశిరోజు వ్రతాన్ని ఆచరిస్తే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని చెప్పు కుంటారు. ఆషాఢ మాసంలోనే చంద్రుని శక్తి సంపూర్ణంగా ఉండే రోజు ఆషాఢ పూర్ణిమ. ఇటు ఆషాఢమనే కారణంగా పవిత్రత, పూర్ణిమైన కారణంగా మానసిక స్వస్థత ఉండడంతో ఈ ఆషాఢ పూర్ణిమను ఉపదేశాన్ని స్వీకరించేందుకు వీలుగా రుషులు నిర్ణయించారు. ఈ పూర్ణిమను గురు పూర్ణిమగా లెక్కిస్తారు. ఆషాఢ మాసంలో ధార్మిక కార్యక్రమాలు మాత్రమే జరపాలని, శూన్య మాసంగా నిర్ణయిస్తూ ఏ శుభకార్యాలైనా చేయడం సరికాదని భావిస్తారు. పరమ పవిత్రంగా జరపుకునే ఏకాదశి రోజునే పండరీపూర్ పల్కియాత్ర కూడా మొదలవుతుంది. సిరిసిల్ల పద్మశాలీలకు షోలాపూర్, పండరీపూర్‌తో అనుబంధం ఉండడంతో పల్కి యాత్రలో కూడా భాగస్వాములవుతారు.

మహా విష్ణువుకు పూజించడం శ్రేష్టం

ఏకాదశి రోజున మహా విష్ణువును పూజించడం ఎంతో శ్రేష్టం. ఉదయమే దేవాలయాలకు వెళ్లి స్వామిని దర్శించి పూజలు చేయాలి. తొలి ఏకాదశి అంటే అన్ని రకాలుగా తొలిసారిగా వచ్చేది. భగవంతున్ని ధ్యానిస్తూ చాతుర్మాస్య దీక్షలను స్వీకరిస్తారు. ఇక్కడి నుంచి పండగలు ఒక్కదాని తర్వాత ఒక్కటి వస్తుంటాయి.

- గంగరపు వంశీ కృష్ణ శర్మ
- పూజారి నస్పూర్ కాలనీ

మహనీయుల జీవితాలు స్ఫూర్తిదాయకం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 4 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల జీవితాలు స్ఫూర్తి దాయకమని జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య పాల్గొని పీడిత ప్రజల సంక్షేమంకోసం వీరోచితంగా పోరాడి అమరుడయ్యాడన్నారు. అలాగే ఉమ్మడ రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా రోశయ్య ప్రజల సంక్షేమానికి కృషి చేశారని ఆయన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పురుషోత్తం, దుర్గా ప్రసాద్, హనుమంతరెడ్డి, కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చెన్నూరు/మందమర్రిటౌన్ జూలై 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పాల్గొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ఏర్పాటుకు బీజం వేసిన చారిత్రక పోరాటాల్లో రైతంగా ఉద్యమానికి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో తెలంగాణ తొలి అమరవీరులు దొడ్డి కొమురయ్య వర్ధంతి శుక్రవారం సీపీఐ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర సాధనలో అమరుడైన గొప్ప మహనీయుడని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్పనర్సయ్య, పట్టణ కార్యదర్శి రాజమౌళి, నాయకులు శ్రీధర్, తిలక్, రత్నం రాజ్యం, ప్రశాంత్, శంకర్‌లు పాల్గొన్నారు.



కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కాసిపేట: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రత్నం ప్రదీప్, యాదవ సంఘం నాయకులు రాజమౌళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.